# పక్కా ప్రణాళికతో తాగునీటి ఎద్దడి నివారణ

- నీటి సరఫరా పరిశీలనకు ప్రత్యేక అధికారుల నియామకం
- ప్రతి గ్రామానికి కార్యాచరణ రూపకల్పన
- నాణ్యమైన ధాన్యాన్ని మద్దతు ధరతో కొనుగోలు చేయాలి
- అమ్మ ఆదర్శ కమిటీతో పాఠశాలల్లో మౌలిక వసతులు
- వడదెబ్బ నియంత్రణ చర్యలు చేపట్టాలి
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లతో మాట్లాడుతున్న సీఎస్ శాంతికుమారి


కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాహుల్‌రాజ్, అదనపు కలెక్టర్లు, జిల్లా అధికారులు

మెదక్, ఏప్రిల్1 (నమస్తే తెలంగాణ): రానున్న రెండు నెలలు పక్కా ప్రణాళికతో తాగునీటి సరఫరా చేపట్టాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులకు ఆదేశించారు. ప్రజలకు ఎక్కడా, ఎలాంటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. సోమవారం హైదరాబాద్‌లోని డాక్టర్ అంబేద్కర్ సచివాలయం నుంచి రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి తాగునీటి సరఫరా ప్రణాళిక, ధాన్యం కొనుగోలు, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనపై సీఎస్ శాంతికుమారి, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్‌లో సమీకృత కలెక్టరేట్ నుంచి కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సరఫరాపై అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసి, సిద్ధంగా ఉన్నామన్నారు. రోజూ నీటి సరఫరాను పర్యవేక్షించాలని, ప్రజలకు ఎక్కడా, ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలన్నారు. తాగునీటి సరఫరా నిమిత్తం మిషన్ భగీరథతో అందుబాటులో ఉన్న వ్యవస్థను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో స్థానికంగా ఉన్న వ్యవసాయ మోటర్లను వినియోగించుకోవాలని అధికారులకు ఆదేశించారు. పట్టణాలు, గ్రామాల్లో తాగునీటి ఇబ్బందులున్న ప్రాంతాలకు ట్యాంకర్లతో నీటి సరఫరా సప్లిమెంట్ చేయాలన్నారు. నీటి సరఫరాలో ఉత్పన్నమయ్యే సమస్యలను వెంటనే గుర్తించి, వాటిని సత్వరం పరిష్కరించేలా చూడాలన్నారు. తాగునీటి సరఫరాను రోజూ పర్యవేక్షించాలని సీఎస్ పేర్కొన్నారు. ఎండ తీవ్రత ఎక్కువవుతున్న నేపథ్యంలో భూగర్భ జలాలు తగ్గి పోతున్నాయని, పట్టణాలు, నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో సైతం ట్యాంకర్లకు డిమాండ్ పెరిగే అవకాశం ఉన్నదని సీఎస్ తెలిపారు. ట్యాంకర్ బుక్ చేసిన వెంటనే సకాలంలో నీళ్లు సరఫరా చేసేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

### కొనుగోలు కేంద్రాల్లో అప్రమత్తంగా ఉండాలి

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మన రైతుల వద్ద నుంచి మాత్రమే ధాన్యం కొనుగోలు చేయాలని సీఎస్ శాంతికుమారి సూచించారు. ఇతర రాష్ట్రాల నుంచి ధాన్యం రాకుండా చెక్ పోస్టులను అప్రమత్తం చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఎండ తీవ్రత దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరా, టెంట్లు ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో వరి సాగు చేస్తున్న రైతులకు సమీపంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలకు ట్యాగింగ్ చేయాలన్నారు. ప్రణాళికాబద్ధంగా కొనుగోలు కేంద్రం వద్దకు రైతు ధాన్యం తెచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వానకాలం 2023-24కు సంబంధించి సీఎంఆర్ రా రైస్ డెలివరీ వేగవంతం చేయాల్సిన అవసరం ఉన్నదన్నారు. భారత ఆహార సంస్థ నిర్దేశించిన సమయానికి రైస్ డెలివరీ చేసే విధంగా ప్రతి జిల్లాల్లో రైస్ మిల్లుల పని తీరును ఉన్నతాధికారులు పర్యవేక్షించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్లు వెంకటేశ్వర్లు, రమేశ్, డీఈవో రాధాకృష్ణ, డీపీవో యాదయ్య, డీఎంహెచ్‌వో శ్రీరాం, తదితరులు ఉన్నారు.

## ఎండ దెబ్బ తగలకుండా అప్రమత్తంగా ఉండాలి

### - కలెక్టర్ రాహుల్ రాజ్


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, ఏప్రిల్ 1(నమస్తే తెలంగాణ): ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు అవుతున్నందున ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని వడదెబ్బ తగలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం కలెక్టర్, రమేశ్‌తో కలిసి ఎండ దెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించే పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎండలో బయట తిరగకుండా ఎండ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. అత్యవసరమైతేనే తప్ప ప్రజలు బయటకు రాకూడదన్నారు. ఎండాకాలంలో నిలిపి ఉన్న వాహనాల్లో పెంపుడు జంతువులను వదలవద్దన్నారు. ఆల్కాహాల్, టీ, కాఫీ, స్వీట్స్, చల్లటి డ్రింక్స్ తీసుకోవద్దని, చెప్పులు లేకుండా బయట నడవద్దని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ సిబ్బంది శ్రీరాం, డీఆర్డీప శ్రీనివాస్ రావు, డీపీవో యాదయ్య, డీఈవో రాధాకిషన్, అధికారులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో నీటి సమస్యను పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో మధులత

నర్సాపూర్, ఏప్రిల్ 1: గ్రామాల్లో తలెత్తిన నీటి సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవో మధులత అధికారులను ఆదేశించారు. సోమవారం నర్సాపూర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో సమావేశ మందిరంలో నీటి సమస్యపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ గ్రామాలు, మున్సిపాలిటీలో నీటి సమస్యను గుర్తించి పరిష్కరించే మార్గాలను ఎంచుకోవాలన్నారు. ఇప్పటికే మిషన్ భగీరథ నీళ్లు వస్తున్నాయని, అవి సరిపోకపోతే ప్రత్యామ్నాయ మార్గాలు ఎంచుకోవాలన్నారు. బోరు మోటర్లను బాగు చేయించి సమస్య ఉన్న గ్రామాల్లో నీటి ఎద్దడిని తీర్చేలా ప్రణాళిక వేసుకోవాలని ఆదేశించారు. రోజురోజుకు ఎండలు ముదురుతుండడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయన్నారు. సమావేశంలో ఎంపీవో శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా గంగమ్మ తల్లికి బోనాలు


కొంటూరులో గంగమ్మ తల్లికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు

మెదక్‌రూరల్, ఏప్రిల్ 1: మండలంలోని కొంటూరులో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ తల్లి జాతర ఘనంగా నిర్వహించారు. చివరి రోజు మహిళలు బోనాలతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. గ్రామంలోని ముదిరాజ్‌లు ఇంటికో బోనం చొప్పున కొంటూరు చెరువు కట్టపై ఉన్న గంగమ్మ ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. డీజే, డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రభాకర్, మాజీ సర్పంచ్ యాదాగౌడ్, ముదిరాజ్ నాయకులు యాదగిరి, ప్రవీణ్, కృష్ణ బాలయ్య, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పన్ను వసూళ్లలో నర్సాపూర్‌కు ఆరో స్థానం

నర్సాపూర్, ఏప్రిల్ 1: ఇంటి పన్ను వసూళ్లలో నర్సాపూర్ మున్సిపాలిటీ రాష్ట్ర వ్యాప్తంగా ఆరో స్థానంలో నిలిచిందని మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్ తెలిపారు. ఈ త్రైమాసికంలో 95.22 శాతం ఇంటి పన్నులు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ఇంటి పన్ను వసూలులో అంకిత భావంతో పనిచేసిన మున్సిపల్ కమిషనర్, మేనేజర్, బిల్ కలెక్టర్లు, వార్డు ఆఫీసర్లు, ఆర్ఐ, ఇతర సిబ్బందికి అభినందనలు తెలిపారు. ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపల్ అభివృద్ధికి సహకరించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు.

## గౌతాపూర్‌లో ఇఫ్తార్


ముస్లింలకు ఇఫ్తార్ విందు ఇస్తున్న ఆదర్శ యువజన సంఘం సభ్యులు

చిలిపిచెడ్, ఏప్రిల్ 1: మండలంలోని గౌతాపూర్ గ్రామంలో ఆదర్శ యువజన సంఘం ఆధ్వర్యంలో రంజాన్‌ను పురస్కరించుకుని ముస్లింలకు ఇఫ్తార్ విందు నిర్వహించారు. ఈ విందులో ముస్లిం మత పెద్దలు మౌలానా యాసీన్, జిన్నాబాయ్, తస్లీంపాషా,సంఘం అధ్యక్షుడు శ్యామ్, యువజన సంఘం సభ్యులు మల్లేశం, కృష్ణ, సత్యం, ఆంజనేయులు పాల్గొన్నారు.

## 104మంది రోగులకు వైద్య పరీక్షలు


రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న మెడిసిటీ వైద్యులు

చేగుంట, ఏప్రిల్ 1: మేడ్చల్ మెడిసిటీ సౌజన్యంతో రాంపూర్‌లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 104 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు పీఆర్‌వో కుమారస్వామి సోమవారం తెలిపారు. అనంతరం 25 మందికి శస్త్ర చికిత్సలకు ప్రత్యేక బస్సులో మెడిసిటీకి తీసుకెళ్లి, తిరిగి ఇంటికి పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ఇంతియాజ్, జాహ్నవి, దావిజ, నాగార్జున, పూజ, పంచాయతీ కార్యదర్శి రోజ పాల్గొన్నారు.

## టాలెంట్ టెస్టులో సీవీరామన్ విద్యార్థుల ప్రతిభ

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 1: హుస్నాబాద్‌కు చెందిన సీవీరామన్ హైస్కూల్ విద్యార్థులు ఒలింపియాడ్ టాలెంట్ టెస్టులో ప్రతిభ చాటారు. ఈఅబ్యాస్, ఐఐటీ,నీట్ ఆధ్వర్యంలో ఒలింపియాడ్ టాలెంట్ టెస్టును హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ టెస్టులో 8 మంది వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ పతకాలు సాధించారు. విద్యార్థులకు ఇస్రో శాస్త్రవేత్తలు పతకాలు అందజేసినట్లు హెచ్‌ఎం తెలిపారు.

## వైభవంగా ధ్వజ స్తంభం ప్రతిష్ఠాపన


జగ్గంపేటలో ధ్వజ స్తంభం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

చిలిపిచెడ్, ఏప్రిల్ 1: మండలంలోని జగ్గంపేట గ్రామంలో నిర్మించిన హనుమాన్ ఆలయంలో మాధవానంద స్వామి, 11 మంది వేద పండితులతో ధ్వజ స్తంభం ప్రతిష్ఠ, బలి ప్రదానం, పూర్ణాహుతి, ప్రాణ ప్రతిష్ఠ, గోమాత పూజలను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి పాల్గొని, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయంలో ఆంజనేయ స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మొదటి రోజు గణపతి పూజతో ప్రారంభమై చివరి రోజు సోమవారం ధ్వజ స్తంభం, విగ్రహాలకు పూజలు చేశారు. ఆలయం వద్ద అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వినోదదుర్గారెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్, మాజీ సర్పంచ్ మాంతప్ప, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు అశోక్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాంచెంద్రారెడ్డి, నాయకులు లక్ష్మణ్, దుర్గారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, ముకుందరెడ్డి, భీమయ్య, వీరాస్వామి, కిషన్‌రెడ్డి, పోచయ్య, నాగిరెడ్డి పాల్గొన్నారు.

## శ్మశాన వాటిక హక్కు పత్రాలివ్వండి: సీపీఎం


ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

నర్సాపూర్, ఏప్రిల్ 1: మండలంలోని కాగజ్‌మద్దూర్ గ్రామంలో గల శ్మశాన వాటికకు హక్కు పత్రాలు ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నర్సాపూర్ డివిజన్ కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ కాగజ్‌మద్దూర్ గ్రామంలో సర్వే నెంబర్ 61/ అ1/1/ 1/1/1లో పూర్వీకుల నుంచి మాల కులస్తులు ఈ శ్మశాన వాటికను ఉపయోగించుకుంటున్నారన్నారు. ఈ స్థలం తమదంటూ కొందరు భూస్వాములు కోర్టులో కేసు వేయడం సరి కాదని మండిపడ్డారు. కొందరు వేసిన పిటిషన్‌ను కోర్టు కొట్టేసి మాల కులస్తులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో మాల కులస్తులు యాదయ్య, కృష్ణ, సలయ్య, కుమార్, లక్ష్మయ్య, మల్లేశ్, దేవరాజు, శోభ, సువర్ణ పాల్గొన్నారు.

## ఈఎస్ఐ డిస్పెన్సరీకి తాళం


ఆర్డీవోకు వినతి పత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

తూప్రాన్, ఏప్రిల్ 1: అద్దె చెల్లింపులను ప్రభుత్వం నిలిపేయడంతో ఈఎస్ఐ డిస్పెన్సరీకి ఇంటి యజమాని తాళం వేసిన ఘటన తూప్రాన్‌లో చోటు చేసుకున్నది. తూప్రాన్‌లోని పోతరాజ్‌పల్లిలో అద్దె భవనంలో ఈఎస్ఐ డిస్పెన్సరీని నిర్వహిస్తున్నారు. కొన్ని నెలలుగా ప్రభుత్వం అద్దె చెల్లింపులను పూర్తిగా నిలిపేయడంతోపాటు, అద్దె పెంచమని భవనం యజమాని కోరినా ఉన్నతాధికారులు స్పందించకపోవడంతో సోమవారం డిస్పెన్సరీకి తాళం వేశారు. దీంతో చేసేది లేక ఈఎస్ఐ డిస్పెన్సరీ వైద్యులు, సిబ్బంది ఆరుబయటే చాలా సేపు వేచి చూసి, ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. అయినప్పటికీ భవన యజమాని తాళం తీయకపోవడంతో చేసేదేమీలేక వైద్యులు, సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోయారు.

## రైతాంగాన్ని ఆదుకోవాలని ఆర్డీవోకు వినతి

హుస్నాబాద్, ఏప్రిల్ 1: హుస్నాబాద్ నియోజకవర్గంలోని రైతులు కరువు పరిస్థితులను ఎదుర్కొని ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారని, ఆదుకునేలా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీవో రామ్మూర్తికి వినతి పత్రం అందజేశారు. భారీగా పెట్టుబడి పెట్టి సాగు చేయగా నీరందక ఎండిపోయిందని, పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

## ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలి


ధాన్యం కొనుగోలు కేంద్రంలో తేమ శాతం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

- ధాన్యాం తూకంలో పారదర్శకంగా ఉండాలి
- కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి
- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్‌రూరల్, ఏప్రిల్ 1: ధాన్యం కొనుగోళ్లు సజావుగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. హవేళీఘన్‌పూర్ మండలంలోని కొత్తపల్లి, రాజ్‌పేట్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను సోమవారం పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో తప్పనిసరిగా టెంట్లు, తాగునీరు, విద్యుత్ వసతి కల్పించాలన్నారు. టార్పాలిన్లు, ప్యాడీక్లీనర్లు, తూకం వేసే యంత్రాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ధాన్యం తూకాల్లో మోసాలు, కాంటా వేసిన బస్తాల్లో తరుగు పేరిటతో రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దన్నారు. రైతులను మోసం చేసే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ధాన్యాన్ని రైతులు దళారులకు అమ్మి మోసపోవద్దని, రైతులకు ప్రయోజనం కల్గించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందన్నారు. తేమ 17 శాతానికి మించకుండా ఎఫ్‌సీఐ ప్రమాణాలకనుగుణంగా నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు.


## మహిళా రైతులు ఆర్థికంగా ఎదగాలి


మహిళా రైతులకు మిని రైస్‌మిల్ అందజేస్తున్న సెహగల్ ఫౌండేషన్ సభ్యులు

చేగుంట, ఏప్రిల్1: మహిళా రైతులు అధునాతన పద్ధతులు పాటించి, అధిక లాభాలు పొంది ఆర్థికంగా ఎదగాలని సెహగల్ ఫౌండేషన్ అసిస్టెంట్ ప్రోగ్రాం లీడ్ మారుతి, సీనియర్ ప్రోగ్రాం లీడ్ శృచి పేర్కొన్నారు. సోమవారం చేగుంట మండలంలోని పులమామిడి కిష్టాపూర్ గ్రామాల్లో మహిళా రైతులకు కూరగాయల పెంపకంపై అవగాహన కల్పించారు. అనంతరం రూ.3.40 లక్షల విలువ గల లేజర్ లెవల్, రూ.40 వేల విలువ గల మినీ రైస్‌మిల్‌ను మహిళా రైతు సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలంతో పాటు వ్యవసాయ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా పంటల విధానంలో మార్పు చేసుకోవాలన్నారు. ఈ మినీ రైస్‌మిల్, లేజర్ లెవల్‌ను వారికి అగ్రిమెంట్ చేసుకుని వినియోగించుకోవాలని సూచించారు. గ్రూప్ సభ్యులతోపాటు ఇతర సభ్యులూ వినియోగించుకోవచ్చన్నారు. గ్రూప్ నిర్ణయించిన ధరకు అద్దెకు ఇచ్చుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సెహగల్ ఫౌండేషన్ ప్రతినిధులు నవనీత్, సలావుద్దీన్, సునీల్, బాల్‌రాజు, పులిమామిడి, కిష్టపూర్, పరిసర గ్రామాల్లోని మహిళా రైతులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా పెద్దమ్మ కల్యాణం

చేగుంట, ఏప్రిల్ 1: మండలంలోని రుక్మాపూర్‌లో నిర్మించిన వనదుర్గ పెద్దమ్మతల్లి కల్యాణాన్ని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. సోమవారం మంగళవాయిద్యాలతో ఆలయంలో హోమం, పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణోత్సవం, ఒడిబియ్యం, అన్నదానం చేశారు. సాయంత్రం అమ్మవారికి బోనాలు తీశారు. కార్యక్రమంలో దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, రెడ్డిపల్లి సొసైటీ చైర్మన్ మ్యాకల పరమేశ్, ఎంపీటీసీ గాండ్ల లతానందం, సంఘం పెద్దలు మ్యాకల మోహన్, భిక్షపతి, శ్రీరామ్ శివయ్య, రాంచంద్రం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వడ్ల నవీన్‌కుమార్, కాశబోయిన భాస్కర్, సంద్రుగు శ్రీకాంత్, తొగుట ఎంపీపీ గాంధారి లతా నరేందర్‌రెడ్డి, సతీశ్, సాయికుమార్‌గౌడ్, ఫరీద్‌నాయక్, భక్తులు పాల్గొన్నారు.


పెద్దమ్మ తల్లి విగ్రహాలను ఊరేగిస్తున్న ఎంపీటీసీ లతానందం ఆలయ కమిటీ సభ్యులు

## నవోదయకు నలుగురు విద్యార్థులు ఎంపిక


నవోదయకు ఎంపికైన చిన్నారులు

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 1: మెదక్‌కు చెందిన నలుగురు విద్యార్థులు నవోదయకు ఎంపికైనట్లు ప్రతిభ నవోదయ కోచింగ్ సెంటర్ కరస్పాండెంట్ జీవన్‌చారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నవోదయ పరీక్ష రాసి 2024-25 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో ప్రవేశాలకు పట్టణానికి చెందిన శ్రీనికరెడ్డి, సహస్ర, గగన్ మహేశ్, సాత్విక్ అర్హత సాధించినట్లు పేర్కొన్నారు. ఈ నలుగురిని పలువురు అభినందించారు.

## పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠకు ఆహ్వానం


మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

చిలిపిచెడ్(కొల్చారం), ఏప్రిల్ 1: కొల్చారం మండలంలోని పొత్తంశెట్టిపల్లి గ్రామంలో ఈ నెల 20 నుంచి 22వ తేదీవరకు ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు ముదిరాజ్ సంఘం సభ్యులు తెలిపారు. సోమవారం పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠకు రావాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్‌కు ముదిరాజ్ సంఘం సభ్యులు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమానికి రంగంపేట పీఠాధిపతులు శ్రీ మాధవానంద సరస్వతి స్వామి హాజరుకానున్నారని తెలిపారు.

## కొనసాగుతున్న ఉపాధి పనులు


నిజాంపేట మల్కచెరువులో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

నిజాంపేట, ఏప్రిల్ 1: మండలంలోని పలు గ్రామాల్లో స్థానికంగా ఉన్న చెరువులు, కుంటల వద్ద ఉపాధి పనులు కొనసాగుతున్నాయి. సోమవారం నిజాంపేటలోని మల్కచెరువులో కూలీలు ఉపాధి పనులు చేపట్టారు. కూలీలు తీసిన గుంతల కొలతల ఆధారంగానే డబ్బులు జమ అవుతాయని ఫీల్డ్ అసిస్టెంట్ తిరుమల్ తెలిపారు. కార్యక్రమంలో కూలీలు విజయ, కవిత, నర్సవ్వ, లక్ష్మి, భూమయ్య, బాలరాజు, లక్ష్మణ్, శ్రావణి ఉన్నారు.

## ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య


రవి (ఫైల్)

వెల్దుర్తి, ఏప్రిల్ 1: ప్రేమించిన అమ్మాయికి వేరే వాళ్లతో నిశ్చితార్థం జరగడంతో మనస్తాపానికి గురైన యువకుడు కోళ్ల ఫారంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లోని దామరంచ గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దోమల పుండరీకం రెండో కుమారుడు దోమల రవి(23) ఇంటి వద్దనే ఉంటూ వ్యవసాయంతో పాటు కోళ్లఫారం నిర్వహిస్తున్నాడన్నారు. ఆదివారం ఉదయం రోజువారిగానే భోజనం తీసుకుని కోళ్లఫారానికి రవి వెళ్లాడు. మధ్యాహ్నం తల్లిదండ్రులు కోళ్లఫారం వద్దకు వెళ్లి తాము ఆరెగూడెం గ్రామానికి వెళ్లి వస్తామని రవికి చెప్పి వెళ్లారు. తిరిగి సాయంత్రం ఐదు గంటలకు కోళ్లఫారం వద్దకు వెళ్లగా కోళ్లఫారంలో రవి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రవినిక కిందికి దింపి తూప్రాన్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. రవి తండ్రి పుండరీకం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వెల్దుర్తి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.